సాక్షి ఆదిలాబాద్

గురువారం | 7 | నవంబర్ | 2024



సింగరేణి సత్తా చాటుతాం

వచ్చే నెలలో ధన్‌బాద్‌లో నిర్వహించే కోలిండియా ఫుట్‌బాల్ పోటీల్లో సింగరేణి సత్తా చాటుతామని కంపెనీస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 10లో ▸

సీఎంను కలిసిన డీసీసీబీ చైర్మన్



కైలాస్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని డీసీసీబీ చైర్మన్లతో కలిసి హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసినట్లు పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌ను కలిసి రైతాంగ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.0/19.0

వాతావరణం

వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

సెర్ప్ ఏడీఆర్డీవోగా గంగన్న బాధ్యతలు



గంగన్నను సన్మానిస్తున్న డీఆర్డీవో సాయన్న

కైలాస్‌నగర్: సెర్ప్ అడిషనల్ డీఆర్డీవోగా బి.గంగన్నను నియమిస్తూ డీఆర్డీవో సాయన్న బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఏడీఆర్డీవోగా పనిచేసిన బండారి నీలయ్య భద్రాద్రి కొత్తగూడెంకు ఓడీపై వెళ్లడంతో ఇక్కడ డీపీఎంగా పనిచేస్తున్న గంగన్నకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు డీఆర్డీవోను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా అన్నారు. సైబర్ జాగృతి దివస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో బుధవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో సీనియర్ సిటిజన్స్‌పై సైబర్ నేరగాళ్లు నూతన విధానాలతో మోసాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఫేక్ యుఆర్‌ఎల్ స్కాం, డిజిటల్ అరెస్ట్ వంటి అంశాలను వివరించారు. అలాగే సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్‌పై అవగాహన కల్పించారు. ఒకవేళ డబ్బులు కోల్పోతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇందులో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సభ్యులు కృష్ణయ్య, దేవదాస్ దేశ్‌పాండే, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదుకు అవకాశం

- సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్

కైలాస్‌నగర్: మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు నమోదులో ఎదురవుతున్న సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో 1950 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉదయం 8 నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఈ నంబర్‌ను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్నికకు సంబంధించి నామినేషన్ల దాఖలు చివరి రోజు వరకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన వారంతా జాబితాలో పేరు నమోదు చేసుకొని రానున్న మండలి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

ఎదులాపురం: ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో స్టాపర్ల ప్రారంభ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందున సీఐ విజ్ఞప్తి మేరకు అగర్వాల్ ఓం ప్రకాశ్, ఆయన కుమారులు జిల్లా పోలీసు వ్యవస్థకు రూ. 3 లక్షల విలువ చేసే 20 స్టాపర్లను అందజేయడం అభినందనీయమన్నారు. వీటిని రద్దీ ప్రదేశాల్లో వినియోగించాలని సూచించారు. ఇందులో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సునీల్, కరుణాకర్, ప్రణయ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: హమాలీల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీడబ్ల్యూసీ గోదాం వద్ద బుధవారం హమాలీ కార్మిక సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు పెంచాలన్నారు. ఇందులో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సంబాజీ, ఎస్.కె అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

బెల్టు జోరు



ఇది పొచ్చర గ్రామంలోని ఓ బెల్టుషాప్. ఆదిలాబాద్‌రూరల్ మండలం పరిధిలోకి వస్తుంది. గత సర్పంచ్ పాలనలో ఒక్క బెల్ట్ షాప్ కూడా ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. పంచాయతీలో తీర్మానం చేసి మరీ ఆ గ్రామంలో మద్యం విక్రయాలు జరగకుండా జాగ్రత్తపడ్డారు. సర్పంచ్ పదవీకాలం ముగిసిన తర్వాత ప్రస్తుతం ఆ గ్రామంలో నాలుగుకు పైగా బెల్టుషాపులు ఏర్పాటయ్యాయి. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

- గ్రామాల్లో విచ్చలవిడిగా షాపుల ఏర్పాటు
- కొన్ని ఊర్లలో 'మినీవైన్స్'లా నిర్వహణ
- కల్తీ మద్యం, దేశీదారుకు అడ్డాగా మారుతున్న వైనం
- అక్రమ దందాపై కరువైన నిఘా
- అధికారుల తీరుపై అనుమానాలు

ఇది ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డు నుంచి ఇంద్రానగర్ వెళ్లే దారిలో ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త బెల్టుషాప్. పక్క పక్కనే ఉండే వడ్డెర కాలనీ, ఇంద్రానగర్, ఖుర్షీద్‌నగర్, రణదీవెనగర్, భాగ్యనగర్, రాంపూర్ ఏరియాలో ఇటీవల అనేక బెల్టుషాప్‌లు ఏర్పాటు చేశారు. గతంలో ఈ ఏరియాలో ఓ వైన్స్‌షాప్ ఉండగా, దాన్ని మరో చోటికి తరలించారు. ఆ తర్వాత ఈ చుట్టుపక్కలా విస్తృతంగా బెల్టుషాపులు ఏర్పాటయ్యాయి.



సాక్షి,ఆదిలాబాద్: జిల్లాకేంద్రమైన ఆదిలాబాద్ పట్టణంలో ముఖ్యంగా మురికి వాడల్లో ఇదివరకు వందకు పైగా బెల్టుషాపులు ఉండేవి. ఇటీవల ఈ సంఖ్య రెట్టింపయ్యాయి. గల్లీల్లో కిరాణ షాపులు, హోటళ్లు, కొన్నిచోట్ల ఇళ్లలోనే మద్యం నిల్వలు ఉంచి అక్రమంగా విక్రయించడం పరిపాటిగా మారింది. తాజాగా ఇంద్రానగర్‌లో ఏకంగా ఒక మడిగిని అద్దెకు తీసుకొని మరీ బెల్టుషాప్ ప్రారంభించారు. ఇక జిల్లాలో 473 గ్రామపంచాయతీలు ఉండగా, ఒక్కో జీపీలో గతంలో రెండు,మూడు చొప్పున కొనసాగుతుండేవి. ఇటీవల వీటి సంఖ్య భారీగా పెరిగినట్లు చెబుతున్నారు. ప్రధానంగా సర్పంచ్‌ల పాలనలో గ్రామాభివృద్ధి కోసం వేలం నిర్వహించి బెల్టుషాప్ ఏర్పాటుకు సహాయపడేవారు. వారి పదవీకాలం ముగియగా పలుగ్రామాల్లో ఇష్టారీతినఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. దీనికి పొచ్చర గ్రామమేనిదర్శనం.

మినీ వైన్స్‌లే..

కొన్ని గ్రామాల్లో బెల్టుషాపులు మినీ వైన్స్‌ల మాదిరిగా నడుస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. తలమడుగు మండలంలోని ఓ గ్రామ పరిధిలో గతంలో వైన్స్ ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ శాఖ భావించినప్పటికీ ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు.దీనికి కారణం లేకపోలేదు. గ్రామాభివృద్ధికమిటీకి ఏటా రూ.10లక్షలు చెల్లించేలా వేలం ద్వారా అక్కడ బెల్టుషాప్ ఏర్పాటు చేశారు. ఒకవేళ ఎక్సైజ్‌శాఖ వైన్స్ ఏర్పాటు చేస్తే వీడీసీకి ఈ పది లక్షలు కూడా రాకుండా పోతాయి. మరోవైపు ఈ షాపు నుంచే చుట్టుపక్కలా అనేక గ్రామాలకు మద్యం సరుకు తరలుతుందంటే లావాదేవీలు ఏ స్థాయిలో జరుగుతున్నాయనేది అవగతం చేసుకోవచ్చు.జిల్లాలో ఇలా కొన్ని గ్రామాల్లో బెల్టుషాప్‌లు మినీవైన్స్‌లా కొనసాగుతున్నాయి.

కల్తీ, దేశీదారుకు బార్లా..

ఇప్పటికే జిల్లాలో వేలాదిగా బెల్టుషాపులు ఉండగా కొత్తవి సైతం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ దుకాణాల్లో లూజ్ మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతాయి. ప్రధానంగా చీప్‌లిక్కర్ అమ్మకాలు జోరుగా ఉంటాయి. ఇటీవల సరిహద్దున ఉన్న మహారాష్ట్ర నుంచి తీసుకొస్తున్న దేశీదారు కూడా ఈ బెల్టుషాపుల ద్వారా విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో సహజంగానే రాష్ట్ర ఖజానాకు లిక్కర్ ద్వారా లభించే ఆదాయానికి గండీ పడినట్టు అవుతుంది. అలాగే కల్తీ జరిగే ఆస్కారం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏదైన అనుకోని ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులనే ప్రశ్న తలెత్తక మానదు.

నియంత్రణ కరువు..

మద్యం విక్రయాల ద్వారా రాష్ట్ర ఖజానాకు అధికంగా ఆదాయం లభిస్తుండడంతో అనధికారికంగా నడిచే బెల్టుషాపుల విషయంలో ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తారనే అపవాదు ముందు నుంచే ఉన్నదే. అయితే ఈ బెల్టుషాపుల్లోనూ లూజు, కల్తీ, దేశీదారు విక్రయాల విషయంలో ఎక్సైజ్ అధికారులు ముందు నుంచి నిఘా ఉంచడం, అక్కడ విచ్చలవిడిగా దందా సాగకుండా నియంత్రించే విషయంలో పలువురు ఆఫీసర్లు కఠినంగానే వ్యవహరించేవారు. ఇటీవల ఆదిలాబాద్ ఆబ్కారీ సర్కిల్ పరిధిలో కొత్త బెల్టుషాపుల ఏర్పాటు చేయడమే కాకుండా,కల్తీ,దేశీదారు విక్రయాలు పెరిగాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో జిల్లా ఎక్సైజ్ అధికారి డీపీఈవో హిమశ్రీని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించి వివరణ కోరినప్పుడు ఆమె సమాధానం దాటి వేశారు. తాను ప్రస్తుతం మీటింగ్‌లో ఉన్నానని చెబుతూ ఫోన్ పెట్టేశారు. తర్వాత మళ్లీ ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు.

సమగ్ర కుటుంబ సర్వే షురూ



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- ఇంటింటికీ ఎన్యూమరేటర్లు
- పలుచోట్ల పరిశీలించిన కలెక్టర్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో బుధవారం ప్రారంభమైంది. ఎన్యూమరేటర్లుగా నియామకమైన ప్రభుత్వ ఉపాధ్యాయులు తమకు కేటాయించిన బ్లాక్‌లోని ఇంటింటికీ వెళుతున్నారు. రెండురోజులపాటు ఇళ్ల జాబితా గుర్తించనున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని న్యూహౌసింగ్ బోర్డులో మొదలైన ఈ సర్వేను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. హౌస్ లిస్టింగ్, స్టిక్కరింగ్ ప్రక్రియను పరిశీలించడంతో పాటు సర్వే సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 2012బ్లాకుల్లో 1,97,000 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. బ్లాక్‌కు ఒక ఎన్యూమరేటర్ చొప్పున నియమించామన్నారు. అలాగే పర్యవేక్షణ కోసం 213 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఎన్యూరేటర్‌తో పాటు అదనంగా బిల్‌కలెక్టర్‌ను కేటాయించామన్నారు. ప్రతీ కుటుంబాన్ని సర్వే చేయాలని వారి ఆధార్, ఫోన్ నంబర్, రేషన్‌కార్డు, ధరణిపాస్‌బుక్ అటవీ ప్రాంతంలో ఉండే వారు కూడా అటవీ హక్కు పత్రాలు నమోదు చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. తమ ఇళ్ల వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సమగ్ర సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఫారాలు అందాక పూర్తిస్థాయి సర్వే చేపడుతామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు ఇందులో భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. అంతకు ముందు కాలనీకి చేరుకున్న కలెక్టర్‌కు కమిషనర్‌తో పాటు కాలనీవాసులు పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సర్వే నిర్వహణపై సంబంధిత అధికారులతో బుధవారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం సర్వే నిర్వహించాలన్నారు. ఇందుకు సంబంధించిన బుక్‌లెట్ ప్రభుత్వం నుంచి రానుందన్నారు. శుక్రవారం నుంచి అన్ని వివరాలతో సర్వే చేపట్టాలన్నారు. సొంత నిర్ణయాలు తీసుకోవద్దని తెలిపారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే మళ్లీ రీస్టిక్కర్స్, రీసర్వే చేయాలన్నారు. సెల్ఫ్ డిక్లరేషన్ భాష, కోడ్‌లను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. డేటా ఎంట్రీ నమోదుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

గేర్జం గ్రామంలో..

ఇచ్చోడ: మండలంలోని గేర్జం గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈబీ మ్యాప్‌తో పాటు వార్డు, ఇంటినంబర్ ఆధారంగా ప్రతీ ఇంటికి స్టిక్కర్ అంటించాలని ఆదేశించారు. అయితే గ్రామంలో స్టిక్కర్లపై నంబర్లు తప్పుగా ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇద్దరికి షోకాజ్ ఇవ్వమని అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం ముఖరా(కే)లో నిర్వహించిన సర్వేను పరిశీలించారు. ఆయన వెంట జెడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్, ఏవో జాదవ్ కైలాస్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం అందితే బతికేదేమో..?

- యువతికి సకాలంలో అందని చికిత్స
- నిర్లక్ష్యం వహించిన పాఠశాల సిబ్బంది?
- ఆస్పత్రికి రాకముందే చనిపోయినట్లు వైద్యుల వెల్లడి
- చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు



ఆస్పత్రికి రాకముందే చనిపోయినట్లుగా 5న ఉదయం 8.50 గంటలకు బోథ్ సీహెచ్‌సీలో నమోదైన రికార్డు

బోథ్: ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన పూల్ కాలి బైగాకు సకాలంలో సరైన వైద్యం అందలేదని తెలుస్తోంది. ఈ క్రమంలోనే మృత్యువాత పడినట్లు సమాచారం. మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద గల సెయింట్ థామస్ పాఠశాలలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువతి కాలి బైగా వంట మనిషిగా విధులు నిర్వహిస్తోంది. ఈ నెల 2న ప్రిన్సిపాల్ స్మిత జార్జ్, వైస్ ప్రిన్సిపాల్ దీపక్, ఉపాధ్యాయులు సోఫి, సిజితో కలిసి నిర్మల్‌లోని గ్రిల్9 రెస్టారెంట్‌లో భోజనం చేశారు. ఈ క్రమంలో అందరూ ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారు. అదేరోజు రాత్రి వాంతులు, విరేచనాలతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. వీరంతా 3వ తేదీన బోథ్ సీహెచ్‌సీలో చికిత్స పొందారు. వారికి వైద్యులు ఇంజక్షన్లతో పాటు మెడిసిన్ అందజేశారు. తరువాత పాఠశాలకు వెళ్లిపోయారు.

కాలి బైగాను ఆసుపత్రికి తీసుకెళ్లని సిబ్బంది..

మరుసటి రోజు కూడా వాంతులు, విరేచనాలు తగ్గకపోవడంతో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు 4వ తేదీన మళ్లీ బోథ్ సీహెచ్‌సీకి వెళ్లారు. కాలి బైగాను మాత్రం తీసుకెళ్లలేదు. నలుగురికి వైద్యులు చికిత్స అందించారు. అనంతరం మెడిసిన్ తీసుకుని వారు పాఠశాలకు చేరుకున్నారు. చికిత్స పొందని యువతి మాత్రం రాత్రంతా వాంతులు, విరేచనాలతో తీవ్రంగా బాధపడినట్లు తెలుస్తోంది. 5న ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను సిబ్బంది చూడగా అప్పటికే అపస్మారకస్థితికి చేరుకున్నట్లు సమాచారం. 8.50 గంటల ప్రాంతంలో బోథ్ ఆసుపత్రికి తీసుకెళ్లడంతో అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే ప్రిన్సిపాల్ మాత్రం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కాలి బైగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొనడం గమనార్హం.

ఆస్పత్రికి చేరుకున్న మృతురాలి కుటుంబసభ్యులు

మృతురాలి తండ్రి రమేశ్, కుటుంబీకులు బుధవారం బోథ్ ఆసుపత్రికి చేరుకున్నారు. వారి నుంచి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అంబులెన్స్‌లో మధ్యప్రదేశ్‌లోని వారి సొంతూరు పంపించారు.

జల్ ఉత్సవ్ విజయవంతం చేయండి



ట్యాంకును పరిశీలిస్తున్న నీతిఆయోగ్ ప్రతినిధులు

నార్నూర్: నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నీతి ఆయోగ్ భాగస్వామ్యంతో ఈనెల 6 నుంచి 20 వరకు నిర్వహించే జల్ ఉత్సవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నీతి ఆయోగ్ ప్రోగ్రాం అధికారి రాహుల్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో గల వాటర్ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జల్ ఉత్సవ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నీటి వినియోగం తదితర అంశాలపై ఈ నెల 6 నుంచి 20 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందులో తహసీల్దార్ జాడి రాజలింగు, నీతి ఆయోగ్ ప్రతినిధి సరోజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్, ఏఈఈ ప్రీతం, సీడీపీవో శారద, ఎంపీవో స్వప్నశీల తదితరులున్నారు.

ఇటు వేతనం.. అటు పింఛన్!

- రూ.7.98 లక్షలు అక్రమంగా పొందిన వైనం
- ఆరుగురు సెర్ప్ సీసీల బాగోతం
- విచారణకు ఆదేశించిన సీఈవో



జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయం

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పనిచేస్తున్న ఆరుగురు సీసీలు ఇటు ప్రభుత్వ వేతనం పొందడంతో పాటు అటు చేయూత కింద నిరుపేదలకు అందించే పింఛన్లు సైతం అందుకుంటున్నారు. విషయం ఏకంగా సెర్ప్ రాష్ట్ర సీఈవో దివ్య దేవరాజన్ దృష్టికి వెళ్లడంతో సమగ్ర విచారణకు ఆదేశించారు. ఇప్పటి వరకు సదరు సీసీలు పింఛన్ల రూపంలో రూ.7లక్షల 98వేల 752లు అక్రమంగా పొందినట్లు తెలుస్తోంది. ఈమేరకు జిల్లా అధికారులు విచారణకు సిద్ధమవుతుండటంతో సంబంధిత సీసీల్లో ఆందోళన వ్యక్తమవుతుంది.

రూ.24వేల నుంచి రూ.27వేల వరకు వేతనం..

మండల సమాఖ్యల పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం, తిరిగి వాటిని కట్టించడం, రికార్డులు నిర్వహిస్తూ, ఆడిట్ చేయించాల్సిన గురుతర బాధ్యత సెర్ప్ సీసీల (కమ్యూనిటీ కోఆర్డినేటర్ల)పై ఉంటుంది. ఇందులో పనిచేసే ఉద్యోగులందరికీ 1 ఏప్రిల్ 2023లో ప్రభుత్వం పే స్కేల్ ప్రకటించింది. సీనియారిటీ, క్యాడర్ వారీగా వేతనాలు నిర్ణయించింది. ఇందులో భాగంగా సీసీలను సైతం పర్మినెంట్ టెన్యూర్ ఎంప్లాయ్ (ఎఫ్‌టీఈ)గా పరిగణించిన ప్రభుత్వం వారికి రూ.24వేల నుంచి రూ.27వేల వరకు వేతనం అమలు చేస్తోంది. అయితే ప్రభుత్వం నుంచి వేతనం పొందే ఉద్యోగులు, సిబ్బంది ఎవరూ కూడా సామాజిక భద్రత కింద నిరుపేదలకు అందించే పింఛన్ పొందేందుకు అవకాశం లేదు. ఒక వేళ అదనంగా ప్రభుత్వ ప్రయోజనాలు పొందితే దాన్ని అక్రమంగా భావించి వారిపై చర్యలు చేపట్టే అవకాశముంటుంది.

పింఛన్లు పొందుతున్నారిలా..

జైనథ్, ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ మండలాలకు చెందిన ఆరుగురు సీసీలు ప్రభుత్వ వేతనంతో పాటు చేయూత కింద పింఛన్ సైతం పొందుతున్నారు. ఇందులో జాదవ్ విజయ వితంతు పింఛన్ కింద రూ. 48,384లను తీసుకోగా, కాడమండ సావిత్రి వితంతు పింఛన్ కింద రూ. 1,80,992 పొందారు. అలాగే మంచికుంట్ల విజయలక్ష్మి రూ.1,74,992లు, షేక్ నహేదా రూ. 50,400, అడెపు లక్ష్మి రూ.1,68,992, ఎల్లుల పోసాని రూ.1,74,992లను బీడీ కార్మికులుగా పింఛన్ పొందుతున్నారు. ఈ ఆరుగురు కలిపి మొత్తం రూ.7,98,752 పింఛన్ రూపంలో ఇప్పటివరకు అందినట్లు తెలుస్తోంది.



GOVERNMENT OF TELANGANA
SOCIETY FOR ELIMINATION OF RURAL POVERTY (SERP)
RURAL DEVELOPMENT DEPARTMENT

Chief Executive Officer.

To
All the District Rural Development Officers,

Sub: SERP – Cheyutha Pension – Cross checking of Cheyutha data with SERP employees data – List communicated for verification – Regarding.

I invite personal attention to the subject cited and informed that during a recent cross-check of Cheyutha Pensioners data with the SERP employees data, it has been observed that certain SERP FTEs are currently receiving Social Security Pension under Cheyutha Pension Scheme, which is not permissible as per norms.

In this regard two lists i.e. list of FTEs who are currently drawing pension and list of FTEs earlier drawn pension and not in live at present, are herewith attached.

To address this issue and ensure compliance with the norms, it is requested to enquire and send the enquiry remarks against each FTE to the undersigned within (3) three days to take further action in the matter.

Encl: 1. Annexure-I (Live Pensioners)
2. Annexure-II (Non-in Live Pensioners)

Yours faithfully,

CHIEF EXECUTIVE OFFICER
SERP, TS HYDERABAD

విచారణకు ఆదేశిస్తూ సెర్ప్ సీఈవో జారీచేసిన ఉత్తర్వు కాపీ

విచారణకు సీఈవో ఆదేశం

సీసీల వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ సమగ్ర విచారణకు ఆదేశించారు. మూడు రోజుల్లోగా నివేదిక అందించాలిందిగా డీఆర్డీవోను ఆదేశిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర స్థాయి అధికారి నుంచే నేరుగా ఉత్తర్వులు అందడంతో సదరు సీసీలతో పాటు అక్రమాలకు పాల్పడుతున్న వారిలో ఆందోళన వ్యక్తమవుతుంది. బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. విధుల నుంచి సస్పెండ్ చేస్తారా.. లేక పింఛన్ రూపంలో పొందిన మొత్తాన్ని రీకవరీ చేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

షోకాజు నోటీసులు జారీ చేశాం



సెర్ప్ సీఈవో ఆదేశాల మేరకు చేయూత పింఛన్ పొందుతున్న ఆరుగురు సీసీలకు షోకాజు నోటీసులు జారీ చేశాం. వారికి పేస్కేల్ ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది.. పింఛన్ ఎప్పటి నుంచి పొందుతున్నారనే వివరాలతో పాటు వారి నుంచి సంజాయిషీ కోరుతున్నాం. వారిచ్చే సమాధానాల ఆధారంగా శాఖాపరంగా చర్యలుంటాయి.

– జి.సాయన్న, డీఆర్డీవో

పెన్షనర్ల ఆందోళన

కైలాస్‌నగర్: పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్‌లతో పాటు ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెన్షనర్లు బుధవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శశికాంత్, జగన్‌మోహన్ మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. అనంతరం ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ హారిక, కలెక్టరేట్ ఏవో బి.రాంరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘ బాధ్యులు, రిటైర్డు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రిటైర్డు ఎంప్లాయీస్

క్లుప్తంగా

గిరిజనుల సంక్షేమానికి చర్యలు


స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో విద్యా, వైద్యం, ఉపాధి కోసం, యువత మానసిక వికాసం కోసం శ్వషోధన్, ధర్మసేవ సంస్థలతో కలిసి ముందుకు వెళ్తున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం ఐటీడీఏ పీవో చాంబర్‌లో హైదరాబాద్‌లోని శ్వషోధన్, ధర్మసేవ సంస్థల ప్రతినిధులు డాక్టర్ పులపల్లి కరుణాకర్‌రెడ్డి, జె.నిషాంత్‌రెడ్డిలతో సమావేశమయ్యారు. ఈ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల సంక్షేమం కోసం చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాలపై పీవో ఖుష్బూ గుప్తా చర్చలు జరిపారు. భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలపై కార్యచరణ ప్రణాళికలు రూపొందించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సల్లా అనిల్, స్రవంతి, డాక్టర్ సంపత్, నిషాంత్, వెంకట్, రాధిక, భార్గవ్‌లు పాల్గొన్నారు.

డ్రంక్‌అండ్‌డ్రైవ్ కేసులో వినూత్న తీర్పు

మంచిర్యాలక్రైం: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై విచారణ అనంతరం మొదటి అదనపు సివిల్ జడ్జి ఉపనిషద్వని వినూత్న తీర్పునిచ్చారు. స్థానిక ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. మంచిర్యాల ట్రాఫిక్ పోలీసులు ఇటీవల కాలంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. కాగా విచారణ అనంతరం బుధవారం 27మందికి స్థానిక మొదటి అదనపు సివిల్ జడ్జి ఉపనిషద్వని జైలు శిక్షకు బదులుగా జిల్లా కేంద్రం కాలేజీరోడ్‌లోని మాత శిశు కేంద్రం ఆసుపత్రిలో వారం రోజుల పాటు రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పారిశుద్ధ్యం పనులు చేయవల్సిందిగా తీర్పునిచ్చారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


రాజ్‌కుమార్

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాజ్‌కుమార్ అనే విద్యార్థి ఈనెల 5న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 విభాగంలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. దీంతో రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీల్లో ఆడటానికి అర్హత సాధించాడు. ఈనెల 7వ తేదీ నుంచి యదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరఫున రాజ్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. సదరు విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అభినందించారు.

సింగరేణి సత్తా చాటుతాం

- ఫుట్‌బాల్ క్రీడాకారుల ఆశాభావం
- కోలిండియా పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులు


సింగరేణిస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: వచ్చే నెలలో ధన్‌బాద్‌లో నిర్వహించే కోలిండియా ఫుట్‌బాల్ పోటీల్లో సింగరేణి సత్తా చాటుతామని కంపెనీస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి కంపెనీ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో బుధవారం ముగిశాయి. పోటీల్లో శ్రీరాంపూర్ జట్టు విన్నర్‌గా, ఆర్జీ -1, ఆర్జీ -2 ఏరియా జట్లు రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా డబ్ల్యూపీఎస్‌అండ్ జీఏ సింగరేణి కంపెనీ స్థాయి ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేయనుంది. కాగా సింగరేణిలో గ్రాస్ ఫుట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని క్రీడాకారులు కోరుతున్నారు. కోలిండియా స్థాయిలో అన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా టర్ఫ్, గ్రాస్ ఫుట్‌బాల్ కోర్టులు ఉంటాయని, సింగరేణి స్థాయిలో అలాంటి కోర్టులు లేకపోవడంతో కోలిండియా స్థాయి పోటీల్లో ఆడడం సింగరేణిస్థాయి క్రీడాకారులకు ఇబ్బంది ఉంటుందని పేర్కొంటున్నారు. క్రీడాకారుల ఇబ్బందులను యాజమాన్యం గుర్తించి సింగరేణి స్థాయిలో ఒక గ్రాస్ ఫుట్‌బాల్ కోర్టును ఏర్పాటు చేయాలని, కోలిండియా పోటీలకు వెళ్లే ముందు క్రీడాకారులకు కనీసం నెల రోజులైనా ప్రత్యేక కోచ్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించాలని సీనియర్ క్రీడాకారులు సూచిస్తున్నారు.


విన్నర్ షీల్డ్ అందుకుంటున్న శ్రీరాంపూర్ జట్టు

ముగిసిన కంపెనీ లెవల్ ఫుట్‌బాల్ పోటీలు


రన్నర్ షీల్డ్ అందుకుంటున్న ఆర్జీ -1, ఆర్జీ -2 ఏరియా జట్టు

మందమర్రిరూరల్: కంపెనీ లెవెల్ ఫుట్‌బాల్ పోటీల్లో బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జట్టు విజయం సాధించింది. రన్నరప్‌గా ఆర్జీ -1, ఆర్జీ -2 జట్టు నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ ట్రోఫీలు అందజేశారు. ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి కార్తీక్, ఏరియా కోఆర్డినేటర్ శివకృష్ణ, స్పోర్ట్స్ సూపర్‌వైజర్స్ అశోక్, రమేశ్, జాన్ వెస్లీ, టీం మేనేజర్స్, క్రీడాకారులు ఉన్నారు.

27సార్లు కోలిండియా పోటీల్లో పాల్గొన్నా..



నేను 1995వ సంవత్సరంలో ఉద్యోగంలో చేరాను. ఫుట్‌బాల్‌పై ఉన్న మక్కువతో విద్యార్థి దశ నుంచే ఆటలో మెలకువలు నేర్చుకున్నాను. సింగరేణిలో పోటీల్లో పాల్గొని సత్తాచాటి కంపెనీ లెవల్ స్థాయికి ఎదిగాను. ఇప్పటివరకు 27సార్లు కోలిండియా, ఒక్కసారి పబ్లిక్ సెక్టార్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను.

– సామల సత్యనారాయణ, జనరల్ మజ్దూర్, ఆర్జీ -1 ఏరియా

కోలిండియా పోటీల్లో సత్తా చాటుతా..



సింగరేణిలో 2015వ సంవత్సరంలో ఉద్యోగంలో చేరాను. ఇప్పటి వరకు 12సార్లు కోలిండియా, ఒక్కసారి పబ్లిక్ సెక్టార్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. సింగరేణి సంస్థ క్రీడాకారులకు అందించే ప్రోత్సాహంతో వచ్చే నెలలో జరుగబోయే కోలిండియా పోటీల్లో పాల్గొని సత్తా చాటుతాను.

– బెల్లం తిరుపతి, శ్రీరాంపూర్ ఓసీ, జనరల్ మజ్దూర్

సింగరేణి ప్రోత్సాహం బాగుంది..



సింగరేణి సంస్థ క్రీడాకారులకు అందించే ప్రోత్సాహం బాగుంది. సింగరేణిలో 1998లో ఉద్యోగంలో చేరి ఫుట్‌బాల్ క్రీడలో నైపుణ్యం సాధించాను. ఇప్పటి వరకు నాలుగుసార్లు కోలిండియా పోటీల్లో పాల్గొన్నాను. వచ్చే నెలలో జరిగే కోలిండియా పోటీల్లో పాల్గొని సింగరేణి యువ క్రీడాకారులతో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తాం.

– బొంగోని చిన్నన్న, ఎస్టీపీపీ ఎస్అండ్‌పీసీ విభాగం

సంస్థకు గుర్తింపు తీసుకురావాలి



సింగరేణిలో నైపుణ్యం కలిగిన మంచి క్రీడాకారులు ఉన్నారు. వచ్చే నెలలో ధన్‌బాద్‌లో నిర్వహించే కోలిండియా ఫుట్‌బాల్ పోటీలకు యాజమాన్యం సిద్ధంగా ఉంది. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని సింగరేణి సత్తాచాటి సంస్థకు గుర్తింపు తీసుకురావాలి.

– చట్ల అశోక్, డబ్ల్యూపీఎస్అండ్‌జీఏ, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ సెక్రెటరీ

జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు ప్రారంభం


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

దండేపల్లి: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో దండేపల్లి మండలం తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్14 బాలబాలికల విభాగం జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంఈవో చిన్నయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు విద్యార్థులకు శారీరకంగా ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడతాయన్నారు. పోటీల్లో 26 బాలుర జట్లు, 12 బాలికల జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఫణిరాజా, పాఠశాల హెచ్‌ఎం సుదర్శన్, మాజీ వైస్‌ఎంపీపీ రాజేందర్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీశ్, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


గేడం శ్రీనివాస్ (ఫైల్)

ఇంద్రవెల్లి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలోని పిట్టబొంగరం గ్రామపంచాయతీ పరిధి పాటగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై దుబ్బక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. పాటగూడ గ్రామానికి చెందిన గేడం శ్రీనివాస్(25) గత సంవత్సరం కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఆరు నెలల క్రితం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించారు. కొంత ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. అయితే గత నెల రోజులుగా మళ్లీ మతిస్థిమితం కోల్పోయి ఎవరితోనూ మాట్లాడకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గ్రామానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కోసుబాయి ఉన్నారు.

దుబాయ్‌లో తెలంగాణవాసి ఆత్మహత్య


సాయిరాం(ఫైల్)

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీ పరిధి చింతల్‌పేట్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్‌పేట్ గ్రామానికి చెందిన బామండ్ల నర్సు –సాయన్నల కుమారుడు సాయిరాం(24) దుబాయ్‌లో పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం సొదరి వివాహానికి వచ్చి తిరిగి వెళ్లాడు. కాగా మంగళవారం బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు అక్కడున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. త్వరగా మృతదేహాన్ని ఇండియాకు చేర్చేలా స్థానిక ప్రజాప్రతినిధులు, గల్ఫ్ సంఘాల నాయకులు కృషి చేయాలని కోరుతున్నారు.

చెరువులో పడి కార్మికుడి మృతి


రాజ్‌కుమార్ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి సింగరేణి కార్మికుడు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ 24 డీప్ ఏరియాకు చెందిన సింగరేణి కార్మికుడు పులి రాజ్‌కుమార్(52) బెల్లంపల్లి పోచమ్మ చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం రాజ్‌కుమార్ తన స్నేహితుడి తమ్ముడి ఐదు రోజుల కర్మ కార్యక్రమానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా అతని ఆచూకీ లభించలేదు. బుధవారం పోచమ్మ చెరువులో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. స్నానం చేయడానికి చెరువులో దిగగా జారిపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాదాస్పదంగా మారిన తోళ్లపరిశ్రమ భూమి


ఎమ్మెల్యే వివేక్‌కు రికార్డులు చూపిస్తున్న సింగరేణి అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి మండల కేంద్రంలోని పాలవాగు సమీపంలో 20 ఏళ్ల క్రితం సింగరేణి సంస్థ ప్రభుత్వం ద్వారా తోళ్ల పరిశ్రమకు కేటాయించిన 25 ఎకరాల భూమి వివాదాస్పదంగా మారింది. పరిశ్రమ మధ్యలో నుంచి సింగరేణి అధికారుల ప్రోద్బలంతో తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయడంతో తోళ్ల పరిశ్రమ సాధన సమితి, మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో పలు ఆందోళనలు చేయడంతో పాటు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు విన్నవించుకున్నారు. కాగా బుధవారం ఎమ్మెల్యే వివేక్ మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా పలు వార్డులను సందర్శించి, తోళ్ల పరిశ్రమ వద్దకు వచ్చారు. సింగరేణి అధికారులతో పాటు తోళ్ల పరిశ్రమ సాధన సమితి, మాదిగ హక్కుల దండోరా నాయకులతో మాట్లాడారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌కు తోళ్ల పరిశ్రమ భూమి విషయంలో జాయింట్ సర్వే నిర్వహించాలని, పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ.20 లక్షలు కేటాయించాలని సూచించారు. జాయింట్ సర్వే అయ్యేంత వరకు సింగరేణి అధికారులు అటువైపు వెళ్లకూడదని ఆదేశించారు. ఆయన వెంట సింగరేణి ఏరియా అధికారులు, తోళ్ల పరిశ్రమ సాధన సమితి సభ్యులు, మాదిగ హక్కుల దండోరా నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అమ్మవారి ప్రసాదం అందజేత

బాసర: ట్రిపుల్‌ఐటీ కళాశాలలో వీసీ గోవర్ధన్‌కు ఆలయ కార్యనిర్వాణాధికారి విజయరామారావు, బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్, పూజారి, వేద పండితులు నవీన్ శర్మ బుధవారం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాలలో విద్యార్థులతో పాటు పాల్గొనాలని ఆహ్వానించారు.

లక్సెట్టిపేట రేంజ్ దాటుతున్న పెద్దపులి?

కాసిపేట: కాసిపేట మండలం ముత్యంపల్లి సెక్షన్, లక్షెట్టిపేట రేంజ్ మేడారం సెక్షన్‌లలో సంచరించిన పెద్దపులి బొక్కలగుట్ట, మంచిర్యాల, హాజీపూర్ మండలం అటవీప్రాంతం దాటుతూ రేంజ్ పరిధిలోని టీకానపల్లి వైపు వెళ్లినట్లు అటవీ అధికారులు తెలిపారు. లక్సెట్టిపేట రేంజ్ అధికారి సుభాష్ మాట్లాడుతూ పెద్దపులి టీకానపల్లి ప్రాంతం వరకు వెళ్లినట్లు గుర్తించామన్నారు. తరువాత మళ్లీ గుట్ట దాటి ఎటు వెళ్తుందో గుర్తించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు పాదముద్రల ఆధారంగా పులి కదలికలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. ట్రాప్ కెమెరాల్లో పులి చిక్కలేదన్నారు.

డబ్బు కాజేసిన సైబర్ నేరగాళ్లు

నస్పూర్: సైబర్ మోసంలో నస్పూర్‌లోని రాంనగర్‌కు చెందిన అడెపు శివకుమార్‌తో పాటు తన బంధువులు, స్నేహితులు రూ. 1,57,319లను పోగొట్టుకున్నట్లు సీఐ ఆకుల అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత సెప్టెంబర్20న సైబర్ నేరగాళ్లు శివకుమార్ ఇన్‌స్టాగామ్ యాప్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో అడ్వరైజ్‌మెంట్ లింక్‌ను పంపించారు. లింక్ ఓపెన్ చేయగానే టెలిగ్రామ్ యాప్‌లో సయ్యద్ మెకలిన్ అను గుర్తు తెలియని వ్యక్తి ప్రొఫైల్‌తో పాటు మరి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తుల ప్రొఫైల్స్ ఓపెన్ అయ్యాయి. ఈక్రమంలో గ్రూప్ వెబ్‌సైట్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని సైబర్ నేరగాళ్లు ఆశ చూపారు. దీంతో పలు దఫాలుగా శివకుమార్‌తో పాటు ఆయన బంధువులు రూ.1,57,319 ఫోన్‌పే ద్వారా పంపించారు. తర్వాత వారి ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయామని గ్రహించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'క్రిప్టో' పేరుతో సైబర్ మోసం

నస్పూర్: సైబర్ నేరగాళ్ల మోసానికి నస్పూర్ మండలం సీతారామపల్లి గ్రామానికి చెందిన బొల్లం భీమయ్య రూ. 67వేలు కోల్పోయినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత నెల అక్టోబర్ 10న ఇన్‌స్టాగామ్ యాప్‌లో క్రిప్టో అనే పేజ్ అడ్వరైజ్‌లో రూ.10వేలు పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని సైబర్ నేరాగాళ్లు ఆశ చూపారు. ఈక్రమంలో భీమయ్య గుర్తు తెలియని వ్యక్తి పంపిన అకౌంట్‌కు పలు దఫాలుగా రూ.67వేలు పంపించాడు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడం.. ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం నంబర్ 1930కి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరగాడి అకౌంట్‌లోని రూ. 32వేలు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ప్రతిభగల క్రీడాకారులకు ఉమ్మడి జిల్లా నెలవు

- ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు
- ఉత్సాహంగా జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు


రెజ్లింగ్ పోటీలో తలబడుతున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతిభగల క్రీడాకారులకు నెలవని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి ఖోఖో, రెజ్లింగ్, రగ్బీ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 3వ స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా స్టేట్‌మీట్ పోటీల్లో విజేతలుగా నిలిచేందుకు శ్రమించాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని పేర్కొన్నారు. అండర్ 17 ఖోఖో బాలికల జోనల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 8 నుంచి ఖమ్మం జిల్లాలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాష్ట్రపాల్ మాట్లాడుతూ జిల్లాలో అండర్ 17 బాలబాలికల పోటీలు నిర్వహించామన్నారు. ఈ జోనల్ స్థాయి పోటీల్లో ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లా జట్లు పోటీ పడ్డాయని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు మేడ్చల్ జిల్లాలో జరిగే పోటీలకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నామ్దేవ్ మాట్లాడుతూ జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను హైదరాబాద్‌లో జరిగే స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో జైనథ్ జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం లస్మన్న, సీనియర్ పీడీ రామ్మోహన్, దయానంద్ రెడ్డి, హరిచరణ్ తదితరులు ఉన్నారు.

9న ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ జిల్లాల క్రికెట్ ఎంపిక పోటీలను ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ అంకయ్య, ఆర్గనైజర్ పీడీ నూనె శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల జెడ్పీహెచ్ఎస్ (బాలుర) పాఠశాలలో శనివారం ఉదయం 9 గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిక పోటీలకు క్రీడాకారులు యూనివర్సిటీకి చెల్లించిన అప్లికేషన్ రశీదు, ఐడి కార్డ్, ఆధార్ కార్డ్, ఎంట్రీ ప్రొఫార్మాతో పాటు 2 ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 94415 50877, 70364 46695 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన చదరంగం పోటీలు


గెలుపొందిన బహుమతులతో విద్యార్థులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని బురదగూడెంలో గల లిటిల్‌ఫ్లవర్ హై స్కూల్‌లో రెండు రోజులు జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ అండర్ 14, 17 విద్యార్థుల చెస్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి బహుమతులు అందజేశారు. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉల్ రెహ్మాన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చదరంగం అభివృద్ధి చైర్మన్ కనకయ్య, పాఠశాల కరస్పాండెంట్, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మహోత్సవం


మహిళా భక్తులు వెలిగించిన దీపాలు

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో కార్తిక మహోత్సవం పూజలు వైభవంగా జరుగుతున్నాయి. కార్తీక మాస ప్రదోషకాల నిత్య దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వెలేటి పవన్ శర్మ ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్య విరచిత సౌందర్యలహరి పారాయణం భక్తులకు వివరించారు. దీపోత్సవం పూజాకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపోత్సవ క్రతువును తిలకించారు. శ్రీ సత్యసాయి నాట్య అకాడమీ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ప్రదర్శన చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువు చంద్రశేఖర్, కళాకారులు శ్రేష్ఠ, మనోజ్ఞ, భావన, లహరి పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీకి 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి మండల వైద్యాధికారి వైద్యసేవలు అందించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఖండాల సబ్‌సెంటర్ పరిధిలోని రాజుగూడ గ్రామానికి చెందిన గిరిజన గర్భిణీ రక్తహీనతతో బాధపడుతుంది. సబ్ సెంటర్ పరిధిలోని వైద్య సిబ్బంది చికిత్స కోసం పీహెచ్‌సీకి రావాలని ఎన్నిసార్లు నచ్చజెప్పినా ఆమె రాలేదు. దీంతో మండల వైద్యాధికారి డాక్టర్ సర్ఫరాజ్ 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్య చికిత్స అందజేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పీ మోహినొద్దీన్, ఆరోగ్య కార్యకర్తలు రాథోడ్ చంద్రకళ, పవర్ ప్రేంసింగ్ తదితరులు ఉన్నారు.